క్లుప్తంగా

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



ఉప్పాడలో రోగులకు మందులు అందజేస్తున్న నాయకులు

కొత్తపల్లి: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడిజాన్ సుదర్శన్ అన్నారు. మండలంలోని ఉప్పాడ సచివాలయం–3లో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్వేత ఆధ్వర్యంలో సిబ్బంది 276 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో సమూల మార్పులు చేశారన్నారు. ప్రతి గ్రామంలోనూ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువయ్యాయన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటనారాయణ, ఈఓపీఆర్డీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ తోటకు నివాళి



గోపాలకృష్ణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దాపురం: నియోజకవర్గానికి దివంగత ఎంపీ తోట గోపాలకృష్ణ చేసిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని కాండ్రకోట గ్రామంలో శుక్రవారం గోపాలకృష్ణ 12వ వర్ధంతిని నిర్వహించారు. ఉప సర్పంచ్ జోకా నానాజీ ఆధ్వర్యంలో వక్తలు మాట్లాడుతూ నియోజకవర్గం, కాకినాడ పార్లమెంట్ పరిధిలో పలు ప్రాంతాలను అభివృద్ధి చేసిన ఘనత గోపాలకృష్ణకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నూకాలమ్మ దేవస్థానం చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఎంపీటీసీ జాగు వీరభద్రరావు, చిక్కం జగ్గరాజు, ఊటా నాగన్న తదితరులు పాల్గొన్నారు.

25 మందిపై బైండోవర్ కేసులు

సామర్లకోట: గతంలో కోడిపందాలు, గుండాటల వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన 25 మందిని గుర్తించి బైండోవర్ చేసినట్టు సీఐ డి.సురేష్ తెలిపారు. వీరిని మండల మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచినట్టు ఆయన తెలిపారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు, గుండాట వంటి కార్యక్రమాలు జరగకుండా ఉండేలా 25 మందిని గుర్తించామన్నారు. ప్రజలు సంప్రదాయ ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.

డ్రైనేజీలోకి దూసుకుపోయిన పాఠశాల బస్సు



మురుగు కాలువలో పడిపోయిన పాఠశాల బస్సు వెనుక చక్రాలు

సామర్లకోట: ప్రైవేటు స్కూల్ బస్సు శుక్రవారం కోలావారి వీధిలోని డ్రైనులోనికి దూసుకుపోయింది. సామర్లకోట నుంచి పెద్దాపురంలోని పాఠశాలకు విద్యార్థులను తీసుకు వెళుతున్న సమయంలో బస్సు కాలువలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో విద్యార్థులకు ఎటువంటి అపాయమూ జరగలేదు. డ్రైవరు నిర్లక్ష్యం వల్ల ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిఠాపురం: మండలంలోని చిత్రాడలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పిఠాపురం పట్టణ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...పిఠాపురం పట్టణానికి చెందిన పీఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ సెక్రటరీ కోన విజయ్‌కుమార్ మోటారు సైకిల్‌పై కాకినాడ వెళుతుండగా చిత్రాడ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరుణాచలానికి బస్సు సర్వీసు

తుని: అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం తుని ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రతి నెలా పౌర్ణమికి ముందు రోజు తుని నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం గిరి ప్రదక్షణ, కంచి క్షేత్రాలను దర్శించుకోవచ్చునన్నారు. భక్తులు రిజర్వేషన్ టికెట్ల కోసం 73829 13216, 73829 13016 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- కొత్తపల్లిలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



పిఠాపురంలో లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న కాకినాడ ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు ప్రభుత్వం పెంచిన రూ.3 వేల పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కొత్త పింఛన్లకు ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ అనారోగ్యంతో సమస్యలతో బాధపడుతున్న పేదలను ఆదుకునేందుకు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. కాగా ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రెండు సార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఏ అవసరం వచ్చిన తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కొత్తగా మంజూరైన 192 పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీలు చెట్టుబత్తిన సురేష్‌కుమార్, మాదిరెడ్డి దొరబాబు, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, ఎంపీడీఓ వెంకటనారాయణ, మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పాలన



కొత్తపల్లిలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: ప్రజాసంక్షేమం, సమాజాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత అన్నారు. పిఠాపురంలో శుక్రవారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారంటే తూ.చా. తప్పకుండా అమలు చేస్తారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను ఒక గ్రంథంలా భావించిన ఆయన దానిలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను అంచెలంచెలుగా పెంచి ప్రస్తుతం రూ.3 వేలు ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ దేశంలో ఏవరికీ సాధ్యం కాని పథకాలను సైతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి చూపించారన్నారు. అనంతరం పిఠాపురం మండలంలో 11,460 మందికి రూ.3.35 కోట్లు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కిట్లు అందజేత



విద్యార్థులకు కిట్లు అందజేసిన ఎంఈఓ, కౌన్సిలర్

సామర్లకోట: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు శుక్రవారం స్పోర్ట్సు కిట్లను అందజేశారు. స్థానిక అయోధ్యరామపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య, కౌన్సిలర్ గుబ్బల సత్య నారాయణ, మాజీ విద్యా కమిటీ చైర్మన్ నక్కా జానకి రామయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి చర్యలు

కాకినాడ ఎంపీ వంగా గీత



ఆలయ మండప నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంన్నట్లు కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత తెలిపారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో శుక్రవారం ఆమె ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి సీతారామస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రూ.1.32 కోట్లతో నిర్మించనున్న ఆలయ ప్రాకార మండప నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మొగలి బాబ్జీ, మొగలి అయ్యారావు, గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, జ్యోతుల భీముడు, పలువురు భక్తులు స్థానికులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సామర్లకోట: మండల పరిధిలో మాధవపట్నంలో ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు పోలీసులు గుర్తించారు. మాధవపట్నం వంతెన సమీపంలో పంట కాలువల మధ్య చెట్టుకు ఉరి వేసుకున్న వ్యక్తిని గ్రామస్తులు శుక్రవారం గుర్తించారు. గ్రామానికి చెందిన దండంగి రాంబాబు (48)గా గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేశానికే ఆదర్శం పింఛన్ల పంపిణీ

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



పెద్దాపురం మండలంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న దొరబాబు

పెద్దాపురం: అర్హులకు సకాలంలో పింఛన్లు అందజేయడంలో దేశానికి సీఎం జగన్ ఆదర్శంగా నిలుస్తారని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన నూతన పింఛన్ లబ్ధిదారులకు శుక్రవారం విడివిడిగా పింఛన్ల పంపిణీ చేశారు. ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగిన సభలో దొరబాబు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులు పింఛన్లు అందుకుంటున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ ఏడాది రూ.3000 అందజేస్తున్నారని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావులు పింఛన్ పెంచి ఇస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి లబ్ధిదారుడు గుర్తు తెచ్చుకుని మళ్లీ సీఎం పీఠంపై కూర్చొబెట్టాలని కోరారు. అనంతరం నూతన పెన్షనర్లకు దవులూరి పెన్షన్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్డీ రాజశేఖర్, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు యినకొండ వీరవిష్ణుచక్రం, సర్పంచ్‌లు కనపర్తి చీమదొర, కురిమెళ్ల లోవరాజు, శ్రీనివాస్, ఎంపీటీసీలు జాగు వీరభద్రరావు, కుంచే బుచ్చిరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాటకు కట్టుబడి పింఛన్ల పెంపు



సామర్లకోటలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేసిన దవులూరి దొరబాబు

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛనును రూ.మూడు వేలకు పెంచారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండల పరిధిలో పింఛన్ల పంపిణీ సందర్భంగా శుక్రవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పింఛను రూ.మూడు వేలకు పెంచుతూ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. మండల పరిధిలో ఇప్పటి వరకు 11,480 మంది పింఛను లబ్ధిదారులు ఉండగా వారికి రూ.3,50,74,00 మంజూరు అయిందన్నారు. కాగా జనవరి నుంచి 200 మంది కొత్త లబ్ధిదారులను గుర్తించి వారికి రూ.ఆరు లక్షలు పంపిణీ చేయనున్నట్టు దవులూరి తెలిపారు. గతంలో పింఛను కోసం జన్మభూమి కమిటీల చుట్టు తిరిగి వారికి ముడుపులు చెల్లించాల్సి వచ్చేదన్నారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షత వహించగా ఎంపీడీఓ డి.శ్రీలలిత, తహసీలార్ ఎస్ఎల్‌వీ కుమారి, వైస్ ఎంపీపీలు ములసా శ్రీను, పేర్నిడి వెంకట్రాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, వైఎస్సార్‌సీపీ నేత ఎలిశెట్టి నరేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- యండపల్లిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



యండపల్లిలో మల్టీపర్పస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని యండపల్లిలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు వారు శ్రీకారం చుట్టారు. గ్రామంలో ఎంపీ నిధులు రూ.25 లక్షలతో చేపట్టే మల్టీపర్పస్ భవన నిర్మాణానికి, అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిధులు రూ.30 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లు, జల్ జీవన్ మిషన్ నిధులు రూ.93.60 లక్షలతో నిర్మించే ఓవర్ హెడ్ ట్యాంకు, పైపు లైన్లకు ఎంపీ, ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతిఇంటికీ రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. అనంతరం ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబును స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు జ్యోతుల చక్రబ్బాయి, గుండ్ర జగ్గారావు, ఉప సర్పంచ్ గుండ్ర చిన్నారావు, వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు గుండ్ర రాజబాబు తదితరులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, ఎంపీపీ కారే సుధ, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిని సురేష్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ముస్లిం కల్యాణ మండపం



మసీదులో ప్రసంగిస్తున్న దొరబాబు

పెద్దాపురం: త్వరలోనే పట్టణ ముస్లింల సౌకర్యార్థం కల్యాణ మండప నిర్మాణానికి చర్యలు చేపడతానని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక కబడ్డీ వీధి జామియా మసీదులో శుక్రవారం నిర్వహించిన ప్రార్థనల్లో దొరబాబు ప్రసంగించారు. అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ టీటీడీ కళ్యాణ మండపం పక్కన ఉన్న పాత మీ సేవా కేంద్ర భవనాన్ని పునర్నిర్మించి, ముస్లింల కల్యాణ మండపం నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇందుకు సమారు రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ముస్లింలు దొరబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఊబా జాన్ మోజెస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, బషీర్, ఖాదర్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రెండు వాహనాలు సీజ్, ముగ్గురిపై కేసు



పట్టుబడిన వాహనాలు, నిందితులతో విజిలెన్స్ అధికారులు

పిఠాపురం: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసి, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు విజిలెన్స్ సీఐ వెంకట్రావు తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు పిఠాపురంలో పోలీసులు శుక్రవారం వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఒక బడా దోస్త్ వాహనంతో పాటు ఇంటింటికీ బియ్యం సరఫరా చేసే ఎండీయూ వాహనాల్లో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. సుమారు రూ 1.18 లక్షల విలువైన బియ్యం స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న కాండ్రకోటకు చెందిన సీహెచ్ లక్ష్మణరావు, పద్మరాజులతో పాటు, పైలా శ్రీను (ఎండీయూ వాహన నిర్వాహకుడు)లను అదుపులోకి తీసుకున్నారు. రెండు వాహనాలను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

కొత్తపల్లి: పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు స్థానిక పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కుతుకుడుమిల్లి శివారు పెదకలవలదొడ్డిలో పేకాడుతున్నారనే ముందస్తు సమాచారం మేరకు ఎస్సై స్వామినాయుడు తన సిబ్బందితో దాడి చేశారు. పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.2020 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

జాతీయ టెక్‌ఫెస్ట్‌లో లక్ష్య విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన లక్ష్య స్కూల్ విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఐఐటీ ముంబైలో గత డిసెంబర్ 27న నిర్వహించిన ఆలిండియా ఆర్టిఫీషియల్, రోబోటిక్ టెక్‌ఫెస్ట్‌లో నిర్వహించిన పోటీలలో లక్ష్య ఇంటర్నేషనల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. దేశ వ్యాప్తంగా 98 పాఠశాలల నుంచి 700 జట్లు పాల్గొనగా సౌత్ జోన్ సీనియర్ విభాగంలో మొదటి స్థానం, జాతీయస్థాయిలో నాలుగో స్థానంలో సానా రిహాన, పైడా సుదీప్, పుప్పాల గౌతమ్ బృందం, జూనియర్స్ విభాగంలో సౌత్ జోన్ రెండో స్థానం, ఆలిండియాలో ఆరో స్థానం సాధించిన జూనియర్ విభాగ బృందం విద్యార్థులు నల్లమిల్లి శేషు రిషిత్‌రెడ్డి, మురళీశెట్టి అభినవ్, ద్వారంపూడి మనోహార్‌రెడ్డిలు అకాష్ అంబానీ, ఇస్రో చైర్మన్ సోమనాథన్, ఎడ్మిరల్ నావెల్ స్టాఫ్ ఆర్.హరికుమార్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, డైరెక్టర్ సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్ వందన బెహరా, వైస్ ప్రిన్సిపాల్ హేమలత శుక్రవారం పాఠశాలలో అభినందించి పాఠశాలలో రోబోటిక్స్ కోసం ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటుచేసి శిక్షణ ఇస్తున్నామన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



తునిలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అలయన్స్ క్లబ్ ప్రతినిధులు

తుని: ప్రస్తుత చలికాలంలో వృద్ధులకు వెచ్చదనం కోసం దుప్పట్లను పంపిణీ చేసినట్టు అలయన్స్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు కె.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. పెంటకోట రోడ్డులోని సాయి వృద్ధాశ్రమంలో 40 మందికి అల్పాహారంతో పాటు టాయిలెట్ కిట్లు, దుప్పట్లు, కొత్తసూరవరం వినాయకుడి గుడి వద్ద 30 మందికి దుప్పట్లు అందజేశారు. క్లబ్ ప్రతినిధులు పి.సత్యనారాయణ, కుచ్చర్లపాటి భీమరాజు, నామన రవి, నాగరాజు, నాగేశ్వరరావు, కంకిపాటి రాము, జీఏ నాయుడు, రామ్ సుందర్, జీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

విస్తృతంగా ఎస్ఈబీ దాడులు



కత్తిపూడిలో పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా దాడులు నిర్వహించి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. కిర్లంపూడి మండలం కృష్ణవరంలో సారా స్థావరాలపై దాడులు చేసి సారా తయారీకి సిద్ధం చేసిన 700 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అబ్బిరెడ్డి రాజుపై పరారీ కేసు నమోదు చేశారు. శంఖవరం మండలం కత్తిపూడిలో సారా బట్టీలపై దాడులు నిర్వహించి, 1,000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో కందిపల్లి అర్జునరావుపై పరారీ కేసు నమోదు చేశారు. కాగా కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాలల్లో వివిధ సారా కేసుల్లో నిందితులుగా ఉన్న 15 మందిని అదుపులోకి తీసుకుని బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో కాకినాడ సెబ్ సీఐ పి. సునీల్ కుమార్, టాస్క్‌ఫోర్స్ వింగ్ ఎస్సై జె.విజయ్‌కుమార్, స్థానిక సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

తొండంగి: అన్నవరం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. సత్యదేవుని ప్రధానాలయంలోని అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, రత్నగిరి మెట్లదారిలో తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి ఘనంగా లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



ధాన్యం రాశిపై కనకదుర్గమ్మకు పూజలు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కనకదుర్గమ్మకు శుక్రవారం నూతన ధాన్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్గశిరమాసాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో కొత్తగా వచ్చిన ధాన్యం రాశిగా పోసి మార్గశిర లక్ష్మీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు ధాన్యం రాశిలోని లక్ష్మీదేవిని దర్శించుకున్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని నూతన ధాన్యంతో పూజలు చేసినట్టు ఆలయ అర్చకులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.